స్వల్ప ఉద్రిక్తతలతో ముగిసిన పోలింగ్

పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన సాధారణ ఎన్నికల ఓటింగ్ స్వల్ప ఉద్రిక్తతల మధ్య సాగింది. జూకల్‌లో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. తెల్లవారుజామున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఇరు వర్గాలు వాగ్వాదానికి దిగడంతో పాటు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదర గొట్టారు.

◆ ఉదయం 9 గంటల వరకు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పాల్మాకులలో సర్పంచ్ పోలింగ్ ఏజెంట్‌గా ఉంటానని పట్టుబట్టగా.. సొసైటీ చైర్మన్ కూడా తాను ఏజెంట్‌గా ఉంటానంటూ.. వాదనకు దిగారు. ఇద్దరికి ఏజెంట్‌గా ఉండేందుకు నిబంధనలు వర్తించవని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు ఒప్పుకోకపోవడంతో పోలీసులు కలగజేసుకుని వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.

ఓటర్లకు తిప్పలు..

◆ గ్రామాల్లో కొన్ని పోలింగ్ స్టేషన్లలో ఎక్కువ మంది ఓటర్లు ఉండగా.. మరికొన్ని బూత్‌లలో తక్కువ ఓటర్లు ఉన్నారు. దీంతో ఎక్కువ ఓటర్లు ఉన్న బూత్‌ల వద్ద ఓటర్లు చాలా సేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది.

◆ కొంతమంది ఓటర్లు పక్క గ్రామాలకు వెళ్లి ఓటు వేయాల్సి వచ్చింది. ఉదయం 10 గంటల తర్వాత ఓటర్లు పోలింగ్ స్టేషన్లకు పోటెత్తారు. మధ్యాహ్నం వరకు ఓటర్లు బారులు తీరారు.

మండలంలో 66 శాతం నమోదు..

◆ మండలంలో 66 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. చిన్నగోల్కొండ, రామంజాపూర్, ననాజీపూర్ గ్రామాల్లోని కొన్ని బూత్‌లలో సాయంత్రం 6 వరకు పోలింగ్ కొనసాగింది.

మణికొండలో స్వల్ప ఉద్రిక్తత..

మణికొండ: బీఆర్ఎస్ పార్టీ నాయకుడి ఇంట్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ ఇంటిపైకి వందలాది మంది రావడంతో మణికొండలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వారిని చెదరగొట్టి పరిస్థితిని చక్కదిద్దేందుకు రాయదుర్గం పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి ఇంటి ముందు ఓటర్లకు పోల్ చిట్టీలను రాసే కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఏర్పాటు చేశారు. అక్కడ చిట్టీలు తీసుకున్న వారికి కొందరిని రామకృష్ణారెడ్డి నివాసంలోకి తీసుకెళ్లి డబ్బులు ఇచ్చి కారు గుర్తుకు ఓటు వేయాలని చెబుతున్నట్టు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్ సోదరుడు యాదయ్యతో పాటు కౌన్సిలర్లు ఆరోపిస్తూ.. వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. రామకృష్ణారెడ్డి ఇంట్లో డబ్బులు పంచుతున్న వీడియో ఉందని అది చూపి పంపిణీ చేసిన ఓ నాయకుడిని పట్టుకుని నిలదీసినట్టు సమాచారం. వందలాది మంది గుమికూడటం, అక్కడ ఏర్పాటు చేసిన పోలింగ్ చీటీలు ఇచ్చే కౌంటర్ టేబుళ్లను ఎత్తి పడేయడంతో అక్కడకు చేరుకున్న మాదాపూర్ ఏసీపీ, రాయదుర్గం సీఐల ఆధ్వర్యంలో అదనపు బలగాలతో కలసి లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ ఘటన జరిగిన స్థలం రాయదుర్గం, నార్సింగి పోలీస్‌స్టేషన్ల సరిహద్దులో ఉండటంతో వెంటనే నార్సింగి పోలీసులు చేరుకున్నారు.


రామంజాపూర్‌లో పోలింగ్‌ను పరిశీలిస్తున్న రూట్ ఆఫీసర్


డబ్బులు ఇస్తున్నట్టు ఉన్న వీడియోను చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడు


వీల్‌చేర్‌పై వచ్చి ఓటువేసి వెళ్తున్న వృద్ధుడు

ఓటు.. జస్ట్.. మిస్.. !

ఆలస్యమవడంతో అనుమతించని పోలీసులు


సమయం మించిపోవడంతో ఓటువేయలేకపోయిన పద్మజ

మణికొండ: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం అసెంబ్లీ ఎన్నికలు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. తమ పనులపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఓటింగ్ వేయాలనుకున్న వారు కొంతమంది చివరి నిమిషంలో అప్పటికే సమయం మించి పోవటంతో ఓటువేయలేక పోయిన ఘటనలు జరిగాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఇలాంటి పరిస్థితి పది మందికి పైగా ఎదురైంది. మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన పద్మజ ఇతర పనిఉండటంతో సాయంత్రం ఓటు వేయొచ్చని భావించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి 5.02 గంటలకు వచ్చింది. అప్పటికే రెండు నిముషాలు ఆలస్యమవడంతో అక్కడ ఉన్న సిబ్బంది ఓటు వేసేందుకు అవకాశం కల్పించకపోవటంతో తిరిగి వెళ్లిపోయింది. ఇదే తరహాలో ల్యాంకోహిల్స్‌లో నివాసం ఉంటూ సొంత పని ఉండటంతో కొన్ని రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన సోహన్‌లాల్, మంగ్ల దంపతులు గురువారం ఓటువేసే నిమిత్తం బయలుదేరి వచ్చారు. విమానం ఆలస్యమవడంతో వారు పోలింగ్ కేంద్రానికి 5 నిముషాలు ఆలస్యంగా రావటంతో ఓటు వేయలేకపోయారు. విమానం ఆలస్యం కావటంతోనే తాము ఓటు వేయలేకపోయామని వాపోయారు.

నియోజకవర్గంలో 56.10 శాతం పోలింగ్

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన పోలింగ్‌లో 56.10 శాతం పోలింగ్ నమోదైంది. శంషాబాద్, గండిపేట్, రాజేంద్రనగర్ మండల పరిధిలో 3,26,461 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1,69,622 మంది పురుషులు కాగా.. 1,56,850 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్లు 12 మంది, వికలాంగులు 15 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ 8 గంటల అనంతరం ఊపందుకుంది. ఉదయం 10 గంటలకు 18 శాతం పోలింగ్ నమోదు కాగా.. అనంతరం మందగించింది. మధ్యాహ్నం ఒంటిగంట అనంతరం ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ గంట ముందు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రానికి రావడంతో పోలింగ్ శాతం పెరిగింది. పోలింగ్ సమయం ముగిసిన అనంతరం క్యూలైన్‌లో నిలబడిన వారందరికి ఓటుహక్కును కల్పించారు. సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మోరాయించడంతో కొత్తగా ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. రాత్రి నియోజకవర్గంలో మొత్తం 56.10 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ శాతం మధ్యాహ్నం అనంతరం పెరగడంతో గెలుపోటములపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు.

పోలింగ్ బూత్‌ల సందర్శన


మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్ దంపతులు


హైదర్షాకోట్ పోలింగ్ బూత్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సందర్శించారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బండ్లగూ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పోలింగ్ బూత్‌లో మేయర్ మహేందర్‌గౌడ్ తన సతీమణితో కలిసి ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలోని బూత్ నెంబర్ 125లో ఈవీఎం మిషన్లు మోరాయించడంతో సాయంత్రం 4 గంటల వరకు కూడా క్యూలైన్లు భారీగా కనిపించాయి. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


నార్సింగి పోలింగ్ కేంద్రంలో పరిస్థితిని సమీక్షిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి


మైలార్‌దేవ్‌పల్లిలో ప్రకాష్‌గౌడ్


ఉప్పర్‌పల్లిలో మాజీ సీఎస్ సోమేష్‌కుమార్


మైలార్‌దేవ్‌పల్లిలో కుటుంబసభ్యులతో తోకల శ్రీనివాస్‌రెడ్డి

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

రాజేంద్రనగర్/మైలార్‌దేవ్‌పల్లి: నియోజకవర్గంలో చెదురు మదురు ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే పోలింగ్ బూత్‌లకు ఓటర్లు తరలివచ్చారు. ప్రముఖులు సైతం భారీ క్యూలైన్లలో నిలబడి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నానికి పోలింగ్ శాతం జిల్లాలోనే అత్యధికంగా నమోదైంది. అనంతరం మందగించినప్పటికీ సాయంత్రానికి ఊపందుకుంది. చివరి గంటలో పెద్దఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి కనిపించారు. క్యూలైన్లలో ఉన్న వారందరికీ ఓటుహక్కును కల్పించారు. దీంతో ఆరు గంటల అనంతరం పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసింది.

◆ మణికొండ, అత్తాపూర్ ప్రాంతాల్లో చిన్నపాటి ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వీఐపీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

శంషాబాద్‌లో 66.7 శాతం పోలింగ్

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు


పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి సరేందర్

శంషాబాద్ : శంషాబాద్‌లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో కలిపి 66.7 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 87,256 ఓట్లకు 58,246 ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం, సాయంత్రం ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. మధ్యాహ్నం సమయం పోలింగ్ ప్రక్రియ బాగా నెమ్మదించింది. సాతంరాయి, గొల్లపల్లిలో ఈవీఎం యంత్రాలు మొరాయించాయి. ఎన్నికల ప్రక్రియను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ పరిశీలించారు. ఓటర్ల స్లిప్పులు పూర్తిగా అందకపోవడంతో ఓటువేయడానికి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓటరు జాబితాలో ఓటులేని ఓటర్లు కూడా ఉసురుమంటూ తిరిగి వెళ్లిపోయారు.

పర్యటనలు.. పర్యవేక్షణలు

పర్యవేక్షించిన అభ్యర్థులు, పోలీస్ అధికారులు

మణికొండ: అసెంబ్లీ ఎన్నికలను ఎప్పటికప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రకాష్‌గౌడ్, కె. నరేందర్‌ముదిరాజ్‌లతో పాటు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డిలు పర్యటిస్తూ.. పర్యవేక్షించారు. ప్రకాష్‌గౌడ్ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పర్యటించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఓటు వేసేందుకు వస్తున్న వారు ఎక్కడి వారు, ఎటువైపు వారి ఓటు ఉండే అవకాశం ఉంటుందని నాయకులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి ప్రజలను పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్‌స్టేషన్లలో కొనసాగుతున్న పోలింగ్ సరళి, ఎలాంటి ఘటనలు జరగకుండా ఇతరులు పోలింగ్‌స్టేషన్లలో ఉండకుండా చర్యలు తీసుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్ పలు పోలింగ్ స్టేషన్లలో పర్యటించారు. మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు డబ్బు పంపిణీ చేయడంతో కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం, ఇతర మున్సిపాలిటీల నాయకులు ఇక్కడకు ఎందుకు వచ్చారనే విషయాన్ని ఆయన రాయదుర్గం సీఐ మహేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

క్యూఆర్ కోడ్‌లతో దారి


క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసుకుంటున్న ఓటర్లు

మణికొండ: ఎన్నికలు అనగానే పట్టణాల్లో పోలింగ్‌కేంద్రాలు, వారి ఓటు ఎక్కడుందో తెలుసుకోవటం గగనంగా మారుతోంది. అవన్నీ వెతుక్కోలేక ఎంతోమంది ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారనేది వాస్తవం. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లు, ఓటర్ల వివరాలను సునాయాసంగా కనుక్కునే మార్గాన్ని బీఆర్ఎస్ నాయకులు ప్రవేశపెట్టారు. ఓటర్లు వారి వద్దకు తమ ఓటరుకార్డు, ఇంటి నెంబరుతో వస్తే వారి వద్ద ఉన్న యాప్ ద్వారా వారి ఓటు వివరాలను తీసిచ్చారు. దీనితోపాటు వారు వెళ్లాల్సిన పోలింగ్ కేంద్రం చిరునామాలను వారు ఏర్పాటు చేసిన క్యూఆర్‌కోడ్‌లను ఫోన్లలో స్కాన్ చేసుకుంటే వారికి సునాయాసంగా అక్కడకు వెళ్లే అవకాశం కలిగింది. దీంతో ఎంతోమంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆ విషయం తెలియని వారు, వారి వద్దకు రాని వారు మాత్రం ఓటు వేయలేకపోయారు.

ఓటు వేసేందుకు సామాన్యుడి ఆసక్తి


కుటుంబసభ్యుల సాయంతో ఓటువేసిన 96 ఏళ్ల వృద్ధుడు

బండ్లగూడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ ఓటుహక్కును వినియోగించేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ బూత్ వద్ద ఉదయం నుంచే ప్రజలు తమ ఓటు వేసేందుకు క్యూలైన్లు కట్టారు. కార్పొరేషన్ అధికారులు ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయి. మహిళలు, యువత ముందుకొచ్చి క్యూలైన్‌లో నిలబడి తమ ఓటును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత అధిక సంఖ్యలో తొలిసారి తమ ఓటును వేశారు. వృద్ధులు సైతం తమ కుటుంబసభ్యుల సాయం తీసుకుని పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటింగ్ సరళి కొనసాగింది.

ఓటు వేసేందుకు వృద్ధులు సైతం..


నార్సింగిలో వీల్‌చైర్‌లో ఓటువేసేందుకు వెళ్తున్న వృద్ధుడు

మణికొండ: తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు బాధ్యతగా వస్తున్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పకడ్బందీగా చేపట్టింది. 80 ఏళ్లు దాటిన వారు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటికెళ్లి ఓటు వేయించే అవకాశాన్ని ఈసారి ఎన్నికల సంఘం కల్పించిన విషయం తెలిసిందే. అంతకు తక్కువ వయస్సు ఉన్నవారు, దివ్యాంగులు పోలింగ్‌బూత్‌లకు వచ్చి సునాయాసంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓ వీల్‌చైర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వారు అక్కడి వరకు కార్లు, ఆటోలలో వచ్చి లోపలికి వీల్‌చైర్లపై వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రజాస్వామ్యంలో భాగస్వాములమయ్యాం.. !

ఓటేసిన నూతన ఓటర్లు


మణికొండలో మొదటిసారి ఓటువేసిన హిమజ


నార్సింగిలో మొదటిసారి ఓటు వేసిన అరుణ్య


తొలిసారి ఓటుహక్కును వినియోగించుకున్న అభి


మొదటి ఓటును వినియోగించుకున్న యువతి

మణికొండ: ప్రజల చేత నాయకులను ఎన్నుకోబడే వ్యవస్థలో తాము ఇప్పటి నుంచి భాగస్వాములమయ్యామని కొత్త ఓటర్లు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఈసారి కొత్తగా ఓటర్లుగా చేరిన యువతీ, యువకులు పదివేలకు మించి ఉన్నారు. వారు గురువారం జరిగిన ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇప్పటి వరకు తామకు ఓటు హక్కు లేనందుకు చిన్నపిల్లలుగానే చూశారని, కానీ ఈసారి తమకూ ఓటు హక్కు వచ్చి పోలింగ్‌లో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో చెప్పే అవకాశం ఈసారి తమకు దక్కిందని పేర్కొన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో వందల సంఖ్యలో వారు ఓటింగ్‌లో పాల్గొన్నారు. రాజకీయాల్లో నీతి, నియమాలు అనుకున్న స్థాయిలో పాటించటం లేదని, మంచి నాయకులను ఎన్నుకునే దిశగా ఎక్కువ మంది ఓట్లు వేయటం లేదని అభిప్రాయపడ్డారు. తమ లాంటి వారు మాత్రం రాబోయే భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దగలిగే పార్టీలకు ఓటు వేస్తామన్నారు.

ఓటేసిన రాజకీయ, సినీ ప్రముఖులు


కోకాపేటలో ముంగిజ్యోతి జైపాల్‌రెడ్డి దంపతులు


గౌలిదొడ్డిలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి


శేరిలింగంపల్లి ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబసభ్యులు


మణికొండ: అసెంబ్లీ ఎన్నికల్లో సినీ సెలబ్రెటీలు, రాజకీయ ప్రముఖులు, అధికారులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో నివసిస్తున్న వారు తమ ఓటుహక్కును సమీపంలోని పోలింగ్ బూత్‌లలో వినియోగించుకున్నా రు. సినీనటుడు వెంకటేష్, సినీగాయని సునిత, సినీనటుడు శివారెడ్డి, నటుడు శివబాలాజీ భార్య నటి మధుమిత్రలు మణికొండలో తమ ఓటును వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ పుప్పాల్‌గూడలో ఓటు వేశారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రతినిధి, మాజీ జెడ్పీటీసీ ముంగి జ్యోతిజైపాల్‌రెడ్డి దంపతులు కోకాపేటలో, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి గౌలిదొడ్డిలో, వైస్‌చైర్మన్ వెంకటేష్‌యాదవ్ నార్సింగిలో, శేరిలింగంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలో వారి కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు.


పుప్పాల్‌గూడలో ఓటువేసిన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్


మణికొండలో ఓటువేసిన సినీనటుడు శివారెడ్డి


మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు

పోలింగ్ ఆవరణలో చిన్నారుల ఆటలు !


పుప్పాల్‌గూడ పోలింగ్ కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు

మణికొండ: ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్ల పిల్లలు తమ తల్లితండ్రులతో పాటు పోలింగ్ కేంద్రాలకు వచ్చి అక్కడున్న ఆట వస్తువులతో ఆడుకున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో అత్యధిక పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. దీంతో మైదానంలో కనిపించిన ఆట వస్తువులతో చిన్నారులు ఆడుకుంటూ కనిపించారు.

మందకొడిగా పోలింగ్

- ఉదయం, సాయంత్రం క్యూలైన్లు
- మధ్యాహ్నం కనిపించని ఓటర్లు

మణికొండ: అసెంబ్లీ ఎన్నికలు గురువారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో మందకొడిగా జరిగాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో కొంత క్యూలైన్లు కనిపించినా మధ్యాహ్నం సమయంలో పెద్దగా ఓటర్లు కనిపించలేదు. స్థానికంగా ఓటుహక్కు ఉన్న ఎక్కువ మంది వారి స్వస్థలాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వెళ్లటం, కొంతమంది పోలింగ్‌లో పాల్గొనేందుకు రాకపోవటంతో గండిపేట మండల పరిధిలో పోలింగ్ శాతం తగ్గింది. కొంతమందికి వారు ఉంటున్న గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటంతో పోలింగ్‌పై ఆసక్తి కనిపించలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జంట మున్సిపాలిటీల పరిధిలో కొన్ని కమ్యూనిటీలకు ఏకంగా ఐదు నుంచి 8 కిలోమీటర్లు వచ్చి ఓటు వేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎక్కువగా ఓటర్లు ఉండే గేటెడ్ కమ్యూనిటీలను గుర్తించి వాటిలోనే పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తే మరికొంత మంది ఓటు వేసేందుకు ముందుకొచ్చే వారని పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్‌కు ఓటర్లు ఆసక్తిగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల తర్వాత పోలింగ్ బూత్‌లలో పెద్దగా జనం కనిపించలేదు. తిరిగి సాయంత్రం 4గంటల సమయంలో ఒక్కసారిగా ఓటు వేసేందుకు ఎక్కువ మంది ప్రజలు రావడంతో క్యూలైన్లు ఏర్పడ్డాయి. కొన్ని పోలింగ్‌బూత్‌లలో సాయంత్రం 5గంటల వరకు వచ్చిన వారు ఎక్కువగా ఉండటంతో 6.30 గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించారు. మున్సిపాలిటీలు, మండలం, నియోజకవర్గ వ్యాప్తంగా సరైన పోలింగ్ వివరాలను వెల్లడించడంలో అధికార యంత్రాంగం తడబాటుకు గురైంది. రాత్రి 10 గంటల వరకు వాటిని అధికారికంగా ప్రకటించలేదు.


శాంతిభద్రతలను పరిరక్షిస్తున్న నార్సింగి, రాయదుర్గం సీఐలు

మార్పు కోరుకుంటున్న ప్రజలు


ఓటుహక్కును వినియోగించుకున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ హైదర్‌గూడలో ఆమె ఓటు వేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. మార్పుకావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. విషయం స్పష్టంగా ఓట్ల రూపంలో చూపించారని తెలిపారు. ఆమెతో పాటు బీజేపీ నాయకులు సుల్గే వెంకటేష్ తదితరులున్నారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్


కుటుంబసభ్యులతో ఓటుహక్కును వినియోగించుకున్న డీసీ రవికుమార్

అత్తాపూర్: రాజేంద్రనగర్‌లోని పలు ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగిందని రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవికుమార్ తెలిపారు. తమ ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఎల్బీనగర్ శాంతినికేతన్ పాఠశాలలో పోలింగ్‌స్టేషన్ 311లో వేసినట్లు ఆయన తెలిపారు.

ఓటు సద్వినియోగం

అత్తాపూర్: పోలింగ్ సందర్భంగా బుధవారం రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓటును వినియోగించుకున్నట్లు సిరా చుక్కను చూపించారు.

